# డాన్స్ బాబూయ్ డాన్స్

న్యూ జెర్సీ పబ్లిక్ స్కూల్ (అమెరికాలో కాదు... ఆంధ్రాలో) ఆవరణ 'ధన్ ధన్'మన్న డ్రమ్ముల చప్పుళ్లతో, చెవులు చిల్లులు పడే అర్కెస్ట్రా శబ్దాలతో అదిరిపోతున్నది! ఆ సాయంకాలం ఓ ప్రక్కన ఈవెనింగ్ క్లాసులు సాగుతూఉన్నా - బయట ప్రాంగణంలో స్టీరియో ఫోనిక్ రికార్డ్ ప్లేయర్ స్పీకర్స్‌లో లేటెస్ట్ హిందీ సినిమా డాన్స్ పాటలు నలుదిక్కులా మారుమ్రోగుతున్నాయి. ఓ పాతిక మంది పిల్లకాయలు - అందులో ఆడపిల్లలూ ఉన్నారు, మగపిల్లలూ ఉన్నారు. ఆ పాటకి - అర్కెస్ట్రాకి అనుగుణంగా హుషారుగా గెంతులు వేస్తున్నారు. మధ్య మధ్యలో డాన్స్ మాస్టారు విజిల్ 'టుర్ టుర్' మంటే... దాంతో రికార్డ్ బంద్. పిల్లలు స్టాప్... మళ్లీ 'టుర్‌టుర్' విజిల్... డాన్స్ మొదలు.

"ఏం బాబూ! బిర్యానీ తినలేదా? చెంగు చెంగున ఎగరాలి కదయ్యా, హీరోకి మల్లే... అయ్యో! ఇట్లా అయితే ఎట్లా? మీ స్కూలు చెట్టెక్కేస్తాది... కమాన్... మళ్లీ స్టార్ట్... వన్... టూ... త్రీ... టుర్‌ర్ర్..." అంటూ డాన్స్ మాస్టారు విజిల్ వూదాడు"

ఛయ్యా...ఛయ్యా ఛయ్యా ఛయ్యా... అంటూ పాట దంచేస్తోంటే... ఇటు పిల్లలు - అమ్మాయిలూ, అబ్బాయిలూ చేతులు పట్టుకొని, చెట్టాపట్టాలేసుకొని - అచ్చం నిజం సినిమాల్లోలాగే - ఆ గ్రూపు డాన్సుల్లాగే - హుషారుగా గెంతేస్తున్నారు.

**వీరాజీ**

ఈ గోలకి పాపం... ఆ చుట్టుపట్ల జనాలు మాత్రం - కుయ్యో మొర్రోమంటూ ఈ గోల భరించలేం నాయనోయ్... అంటూ గోలెట్టేస్తున్నారు. ఎవరు వింటారు?

ఇంతకీ ఆ స్కూలు వార్షికోత్సవానికి సాగుతున్న సన్నాహాలన్న మాట అవి! కల్చరల్ ప్రోగ్రామ్స్ అంటారు వీటిని వాళ్లు. వార్షికోత్సవ వినోద కదంబ కార్యక్రమాలు లేదా సాంస్కృతిక కార్యక్రమాలు అని పిలవబడే వీటికి - నేతిబీరకాయలో నెయ్యి ఎంతవుంటుందో - సంస్కృతి, సంప్రదాయం, సంస్కారం కూడా అంతే ఉంటాయి.

ఈ రికార్డింగ్ నాట్య కార్యక్రమానికి కనీసం మూడు వారాల రిహార్సల్స్ అయినా ఉంటాయి. దానికో కమిటీ - అందులో వేడి వేడి చర్చలూ జరిగాయి. ఎనిమిదో తరగతి సైన్స్ మిస్‌కి సంగీతంలో డిప్లొమా కూడా ఉంది. పోయినసారి ఆగస్ట్ పదిహేనున జానపద గీతాలు, దేశభక్తి పాటలూ బాగా పాడిందని పేరెంట్స్, పిల్లలూ కూడా అన్నారు. అంచేత ఆమె నేపథ్యగానంలో - 'మొన్నజొన్న తోటలో' అన్న నృత్యం ఏర్పాటు చేయాలి... అని తెలుగు మాస్టారు అన్నారు.

"అబ్బే! అదేం పాట? మంచెకాడ కల్సుకో... మరువకు మామయ్యా... అంటుంది. అదేం మంచి టేస్ట్ కాదు అంది హిందీ మిస్. పోనీ కూచిపూడి డాన్స్‌లు పెడదాం. మన డాన్స్‌టీచర్‌కి తెలిసిన నట్టువాంగం బృందం ఉందిటగా" అంటూ ఇంగ్లీష్ మిస్ సూచించింది.

"కూచిపూడి డాన్స్ అంటే... చెంబూ, పళ్లెం పెట్టుకొని, సర్కస్ చేస్తూ ఉంటారు..." అంటూ కరస్పాండెంట్ నవ్వేశాడు. గ్రూప్ డాన్స్‌లుండాలి... లేకుంటే పిల్లకాయలు గోలపెడతారు మళ్లీ – మాకు ఛాన్స్ యివ్వలేదంటే – మాకివ్వలేదంటూ... అంచేత ఓ ఇరవై మంది స్టూడెంట్స్‌కయినా ప్రతి పాటలో, డాన్స్‌లో ఛాన్స్ యివ్వాలి" అన్నాడాయన.

"ఇది మంచి ఐడియా సార్! ఇప్పుడన్ని స్కూల్స్‌లోనూ 'ఛయ్యా ఛయ్యా' లాంటి పాటలే...! అంటూ లెక్కల మిస్ ఉత్సాహంగా చెప్పింది.

పేరెంట్స్ కూడా 'గాజువాక పిల్లా, గాజులోళ్లమే పిల్లా మేమే – సబ్బులోళ్లమే పిల్లా' పాటే కావాలంటారండీ... ఇప్పుడు స్కూల్లో – స్కూళ్లల్లోనే కాదు – కాలేజీల్లో కూడా – కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో యిట్టాంటి పాట తప్పనిసరి సార్! అంటూ డ్రిల్ మాస్టారు చొక్కా చేతులు ముడుచుకుంటూ మరీ చెప్పాడు.


ఇట్లా వాదోపవాదాల తర్వాత...

కమిటీ అంతా కలిసి ఒక పాపులర్ హిందీ సాంగ్‌ని, మరో టాప్ బూతుల తెలుగు పాటనీ ఎంపిక చేసి – ఓ డాన్స్ మాస్టర్ని, దాంతో బాటు పెళ్లి ఊరేగింపులో వాయించే ఆర్కెస్ట్రా గ్రూపునీ 'బుక్' చేసుకున్నారు. పిల్లల్లో కొంతమంది టి.వి. ఛానల్స్‌లో 'డాన్స్ భోర్ డాన్స్' వంటి కార్యక్రమాల్లో డాన్స్‌లు చేసినవాళ్లున్నారు. అంచేత యిదేమంత ప్రాబ్లమ్ కాదు అనుకున్నాడు.

పదో తరగతిలో ఉన్న సంపత్ ఏ నాట్యం అయినా యిలా అవలీలగా చేస్తాడు. చేసి, చూపించి, పిల్లల చేత చేయించగలడు కూడా! అంచేత డాన్స్ లీడర్‌గా సంపత్‌ని పెట్టారు.

అవసరమయిన డ్రస్‌లు కొనడానికి – ఈ వార్షికోత్సవంలో తమ పిల్లల కోసం పైసలు బాగా ఖర్చు పెట్టడానికీ ముందుకు వచ్చిన మమ్మీ, డాడీల సాయంతో – కలర్‌ఫుల్ నాట్యం రెహ్మాన్ డ్రమ్మల శబ్దాలు ఉన్నదాన్ని సెలెక్ట్ చేసి, దాంతో రిహార్సల్స్ మొదలెట్టారు.

స్కూలు ఆవరణ, స్టేజి కూడా చాలవని – ఫంక్షన్‌కి ప్రతిష్టాత్మకమైన 'కళాపీఠం' ఆడిటోరియం అద్దెకు తీసుకున్నారు. ఝూమ్మని సాగిపోయారు.



సంపత్‌ది రాకెట్ స్పీడ్. మరో విద్యార్థిని విద్యుల్లతది సరేసరి! మెరుపు తీగే! అసలు వీళ్ల ఎంచుకున్న సినిమా పాటలో మగపాత్రలు లేవు గానీ - వీళ్లు పదిమంది మగపిల్లలకి అవకాశం యిచ్చి ఒరిజినల్ డాన్స్‌కి - హుషారైన మార్పులు, కూర్పులూ చేసేసారు.

క్లాసుల్లో, స్కూలు ఆవరణలో - ఎక్కడ చూసినా యీ మగా, ఆడా పిల్లలు - పూలు దారంతో కలిసిపోయినట్లు - చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారు. ఈ ప్రోగ్రామ్ సందడే స్కూలు అంతటా. అంతటా ఫెస్టివల్ వాతావరణం వచ్చేసింది.

రానే వచ్చింది - ఆ వార్షికోత్సవ శుభదినం. స్టేజి మీద కళ్లు చెదిరేలా - ఎవరు మగపిల్లలో - ఎవరాడపిల్లలో తెలీకుండా కలిసిపోయి, నాట్య ప్రదర్శన సాగించారు తుఫాన్‌లా.

కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి! కొంత మంది ఫొటోగ్రాఫర్లను పేరెంట్స్ ఏర్పాటు చేసుకున్నారు. కొందరు వీడియోలు కూడా తీయించుకున్నారు...

ఈ రికార్డింగ్ డాన్స్‌ల తర్వాత - ప్రయిజు డిస్ట్రిబ్యూషన్ రానే వచ్చింది. కార్పొరేటరు - దండు బాబుగారు లెక్చరిచ్చాడు. ఎవరూ వినే మూడ్‌లో లేకపోయినా... ఆయన ఉపన్యాసం ఆగలేదు! పిల్లలు జనగణమణ అనే వరకూ సాగింది...

సోషల్‌మిస్ మైక్‌లో అరిచింది. "ఫస్ట్ ప్రయిజ్ జాయింట్‌గా - సంపత్, విద్యుల్లతలకి యిచ్చాం. వాళ్లు వేదిక మీదికి రావాలి. ప్లీజ్! కమ్ టు డయాస్" అంటూ -

ప్చ్... ప్చ్... ఎవ్వరూ రాలేదు. మళ్లీ అనౌన్స్‌మెంట్ చేసింది. పిల్లలలో కలవరం తారస్థాయికి చేరుకుంది.

"జెండాపై కపిరాజు" అంటూ అరిచారు పిల్లలు కొందరు.

"కమ్ కమ్ బాబీ... హలో బాబీగాల్... లెట్స్‌గో పార్టీ" అంటూ కేకలేసారు మరికొందరు. 'పారిపోదాం! ప్రేమించుకుందాం! పెళ్ళి చేసుకుందాం! అంటూ గోలచేసారు ఆకతాయి స్టూడెంట్స్...

వేదికమీద ఉన్న వారి ముఖాలు నల్లగా మాడిపోయాయి! సంపత్, విద్యుల్లతల తల్లి దండ్రుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. కంగారు పడ్డారు...

పిల్లలేమయినట్లు? గంద్రగోళం మొదలైంది. స్కూలు నిర్వాహకులు తెలివిగా మైక్‌లో చెప్పారు -


"యువర్ ఎటెన్షన్ ప్లీజ్! పిల్లలు ఛేంజ్ రూమ్‌లో మేకప్‌లు కడుక్కుంటున్నారు కాబోలు... ఈలోగా సంపత్ మదర్‌గారూ, విద్యుల్లత మదర్‌గారూ వచ్చి - వారి పిల్లల ప్రతిభకి వచ్చిన యీ బహుమతులను తమ అమృత హస్తాలతో అందుకుంటారు" అంటూ ఎనౌన్స్ చేసింది సోషల్ మిస్. ఆమె చాలా తెలివైంది అంటారు అందుకే-

మళ్లీ కరతాళ ధ్వనులు, హిప్ హిప్ హుర్రేలు... ఆ యిద్దరి పేరెంట్స్ చెవుల్లోనూ పడడం లేదు. వాళ్ల ప్రాణాలు కడగట్టుతున్నాయి.

"దే ఎస్కేప్డ్... ఎస్కేప్డ్ ఏమిటీ? 'ఎలోప్డ్' అనాలి! అంటున్నారెవరో - తలో వ్యాఖ్యానం చేస్తున్నారు.

"అనుకున్నాం... కాస్ట్యూమ్ కిట్స్‌కి తాళాలు వేసి, రెండో కంటికి దొరక్కుండా దాచేసుకున్నారు. అప్పుడే అనుకున్నాం" అన్నారు కొందరు.

రోజూ రిహార్సల్స్... ఆనక కృష్ణాతీరంలో బోటు షికారు అందరికీ తెలుసు. డబ్బులున్న




పీపుల్ పిల్లలండీ బాబూ! నో ఆస్కర్... నో టెల్లర్... అంటే అడిగేవారుండరు, చెప్పేవారుండరు... అన్నాడు రాజు.

"అయినా మనకెందుకు? ప్రిన్సిపాల్ గారి సి.ఐ.డి.లు మనమాటలు వింటే కొంప మునుగుతుంది" అన్నారు ఎవరో. ఈలోగా కరస్పాండెంట్ గప్‌చిప్‌న పేరెంట్స్‌ని ప్రక్కకి తీసుకుపోయాడు. "లెటజ్ టాకిల్ దిస్ కేర్‌ఫుల్లీ. ఇది సున్నితమయిన విషయం... నా కారు తీసుకుని మా డ్రిల్లు మాస్టారు వస్తాడు. వాళ్లు ఎక్కడికి పోతారు? ఫ్రెండ్స్ యిళ్లకి పోయుంటారు" అంటూ సర్దిచెప్పాడు - వెళ్లండి... వెతకండి అన్నాడు.

డ్రిల్ మాస్టారే యీ ప్రోగ్రామ్‌కి రింగ్ మాస్టర్ కనుక అతడ్ని తిట్టసాగారంతా... అతనికో ఐడియా వచ్చింది. "పదండి" అంటూ పేరెంట్స్‌ని ఎక్కించుకొని రైల్వేస్టేషన్‌కి దౌడు తీయించాడు.

'విద్యుల్లతకో టెలిఫోన్ ఫ్రెండున్నాడు - సినీఫీల్డులో...' అక్కడికే పోవచ్చును. హైదరాబాద్ వెళ్ళే రైళ్లు వెతుకుదాం! పదండి అన్నాడు.

పేరెంట్స్‌కి కాలూ చెయ్యీ ఆడక, నోట మాట రావడం లేదు.

"వచ్చే ఏడాది వార్షికోత్సవం - కల్చరల్ షో అన్నారంటే చంపుతా! నరుకుతా! అందరి - ఉద్యోగాలూ పీకేస్తాను - యామనుకుంటున్నారో..." అంటూ చిందులు వేస్తున్నాడు ప్రిన్సిపాల్!...

'వాళ్లిద్దరూ 'లేచిపోదాం' సినిమాని పది సార్లు చూసారు! "లేచిపోయి ఉంటారు! ఎక్కడో... డిస్కోటెక్కుల్లో ఎంజాయ్ చేస్తూ ఉంటారు...' అని సంపత్ ఫ్రెండ్ చెవిలో చెప్పింది విద్యుల్లత ఫ్రెండ్!

'అదృష్టవంతులు... మనం కలిసి కనీసం ఏదన్నా సినిమాకి పోదామా?' అడిగాడు అబ్బాయి.

'ఛలో! మా నాన్న ఊళ్లో లేడు... అంది ఆ అమ్మాయి...'

●